


డిజెకి అనుమతి లేదు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

వినాయక చవితి మండపాల వద్ద, ఊరేగింపులో డిజెకు అనుమతి లేదని పట్టణ సిఐ మురళీధర్ ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. వినాయక విగ్రహాలను తొమ్మిది రోజులు మాత్రమే ఉంచాలని, ఆపైన ఎటువంటి అనుమతులూ లేవని స్పష్టంచేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యుల ఆధార్ కార్డు, పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. మండపాల వద్ద శబ్ద కాలుష్యం వచ్చే స్పీకర్లు ఉపయోగించరాదని, ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే స్పీకర్లు పెట్టాలని తెలిపారు. నిమజ్జనం కోసం పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు.

అరకు పార్లమెంటు అధ్యక్షుడెవరో?

నేడు విశాఖలో టిడిపి పరిశీకులతో సమావేశం ● జిల్లాల వారీగా కమిటీల్ని నియమించాలనే డిమాండ్ తెరపైకి

ప్రజాశక్తి-పార్వతీపురం

అధికారపార్టీ పార్లమెంటు నియోజకవర్గ కమిటీల నియామకానికి రంగం సిద్ధం చేసింది. దీనిలో భాగంగా అరకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, నాయకులతో సోమవారం విశాఖపట్నంలో సమావేశం జరగనుంది. పార్టీ అధిష్టానం నిర్దేశించిన పరిశీలకుల సమక్షంలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సమావేశం కానున్నారు. ఇంతవరకు టిడిపి అరకు పార్లమెంటు అధ్యక్షులుగా కిడారి శ్రవణ్ కుమార్ వ్యవహరిస్తున్నారు. యువకుడు, విద్యావంతుడైన కిడారి శ్రవణ్ కుమార్ ప్రస్తుతం గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా కూడా ఉన్నారు.

అరకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఆరు ఎస్‌టి నియోజకవర్గాలు, ఒక ఎస్‌సి నియోజకవర్గం ఉన్నాయి. కురుపాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాలు మన్యం జిల్లాలో, అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్నాయి. ఈ పార్లమెంటు నియోజకవర్గం సుమారు 500 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పుడు కూడా పోటీలో ఉన్న ఎంపి అభ్యర్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో విస్తీర్ణం పరంగా చూస్తే ఇదే పెద్ద పార్లమెంటు నియోజకవర్గంగా కనిపిస్తోంది. ఇంత పెద్ద నియోజకవర్గాన్ని ఏకతాటిపై నడిపించడం ఏ నాయకుడికైనా కత్తిమీద సాము లాంటిదే. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా కమిటీల నియామకం చేపట్టాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇప్పటికే టిడిపి కూటమిలో ఉన్న బిజెపి జిల్లాల వారీగా కమిటీల నియామకం చేపట్టింది. వైసిపి కూడా జిల్లాల వారీగా కమిటీల నియామకం జరిపింది. పార్టీ పరంగా తలెత్తే సమస్యల పరిష్కారం, గ్రూపు రాజకీయాల నియంత్రణ వంటి అంశాలపై దృష్టిసారించాలంటే జిల్లాల వారీగా కమిటీల నియామకమే ఉత్తమమని టిడిపి నాయకులు కూడా భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహించనున్న పార్లమెంటు నియోజకవర్గ కమిటీ సమావేశంలో టిడిపి నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచిచూడాలి.

అధ్యక్ష రేసులో సీనియర్ నాయకులు

టిడిపి పార్లమెంటు నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా పని చేయడానికి కొంతమంది సీనియర్ నాయకులు విముఖత చూపుతున్నారు. మన్యం జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తే నాయకత్వం వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మన్యం జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో బిసిల ఆధిపత్యం ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లా కమిటీకి బిసికి చెందిన సీనియర్ నాయకుడిని అధ్యక్షులుగా నియమిస్తే పార్టీకి ప్రయోజనంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులుగా ఉన్న కిడారి శ్రవణ్ కుమార్ రాజకీయాల్లో జూనియర్ కావడంతో సీనియర్ నాయకులను నియంత్రించ లేని పరిస్థితి నెలకొంది. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్‌ని అధ్యక్షులుగా నియమించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వయోభారం, ఆరోగ్య సమస్యల కారణంగా ఆయన విముఖత చూపుతున్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ కూడా జిల్లా అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. ఆయనకు గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లా అధ్యక్షులుగా పని చేసిన అనుభవం ఉంది. సోమవారం నిర్వహించనున్న సమావేశంలో పార్టీ అధిష్టానం పరిశీలనకు మూడు పేర్లు ప్రతిపాదించే అవకాశం ఉంది. ఈ ముగ్గురిలో నుంచి ఒకరిని పార్టీ అధ్యక్షులుగా నియమించనున్నారు.

పనితీరు బాగోలేదు

మంత్రి సంధ్యారాణికి సిఎం క్లాస్!

మన్యం జిల్లాకి చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి సిఎం చంద్రబాబు నాయుడు క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. ఇటీవల గిరిజన సంక్షేమ శాఖలో చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ ఎసిబి వలలో చిక్కడం, తదనంతర పరిణామాల నేపథ్యంతోపాటు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గంలో టిడిపి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నదనే ఫిర్యాదులు అధిష్టానానికి వెళ్ళాయి. ఇప్పటికే తొలివిడతలో కొంత మంది ఎమ్మెల్యేలతో సిఎం చంద్రబాబు నాయుడు ముఖాముఖి మాట్లాడారు. పనితీరు మార్చుకోకపోతే తోక కత్తిరిస్తానని హెచ్చరించారు. రెండో విడతగా శనివారం మరో 15 మంది ఎమ్మెల్యేలతో ఆయన మాట్లాడినట్లు తెలిసింది. అందులో భాగంగా మంత్రి సంధ్యారాణికి కూడా పిలుపు రావడంతో ఆమె నియోజకవర్గం నుంచి హుటాహుటిన బయలుదేరారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మరించడం, తనకు నచ్చిన వారికే ప్రాధాన్యత ఇవ్వడం, మండల కమిటీల నియామకంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై పార్టీ నాయకత్వం ఆమెపై తీవ్ర ఆగ్రహంతో ఉంది. దీనికి సంబంధించిన సర్వే, ప్రభుత్వ ఇంటెలిజెన్స్ నివేదికలు సిఎం చంద్రబాబు వద్ద ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మంత్రి సంధ్యారాణికి సీరియస్ వార్నింగ్ ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. సమీప భవిష్యత్తులో జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో సంధ్యారాణికి ఉద్వాసన తప్పదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.



అభివాదం చేస్తున్న సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

కార్మిక హక్కులను కాపాడుకోవాలి

- సిఐటియు నాయకుల పిలుపు
- ఘనంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా మహాసభ



అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, సింహాచలం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

కార్మికుల హక్కులను కాపాడుకోవాలని, అందుకోసం పోరాటమే మార్గమని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) పార్వతీపురం మన్యం జిల్లా 4వ మహాసభ ఆదివారం సాలూరు పట్టణంలో అత్యంత ఉత్సాహపూరితంగా జరిగింది. మహాసభకు ముందు రాజేశ్వరరావు పార్కు నుంచి నిర్వహించిన ర్యాలీ.. డీలక్స్ సెంటర్, చిన్న బజారు, బోసుబొమ్మ జంక్షన్ మీదుగా డబ్బివీధిలోని వెంకటేశ్వర మండపం వరకు సాగింది. అనంతరం మహాసభకు సూచికగా సిఐటియు జెండాను మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు నాగవశం శంకర్రావు ఆవిష్కరించారు. అనంతరం ఎన్.శంకర్రావు, టి.శంకర్రావు, సంజీవి అధ్యక్షత వర్గంగా మహాసభ ప్రారంభమైంది. తొలుత ఇటీవల కాలంలో మృతి చెందిన నాయకులకు నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, కోశాధికారి జి.సన్యాసిరావు మాట్లాడారు. రాష్ట్రంలోను, జిల్లాలోను కార్మిక హక్కులపై అణచివేత విధానాలు అమలు చేస్తే ఐక్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన అన్ని రకాల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు నిలిపివేశారని, తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పోరాడుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత 17 రోజుల సమ్మె కాలంలో చేసిన నిర్ణయాలకు జీవోలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరైనది కాదని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పర్మినెంట్ కార్మికులకు నేటి వరకు పిఆర్‌సి లేదని, ఇంక్రిమెంట్లు పెండింగ్ ఉన్నాయని, కనీసం యూనిఫామ్ కుట్టు ఛార్జీలు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, చనిపోయిన కుటుంబాలకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిటీ వెంటనే వేయాలని, అప్పటివరకు ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన మన్యం జిల్లాకు నిధులు కేటాయించి మున్సిపాలిటీలకు కూడా నిధులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 13, 14తేదీల్లో జరుగున్న సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ నివేదికను యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ప్రవేశపెట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీను, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు కోలక లీల, ఐద్వా నాయకులు లక్ష్మి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు జానకిరావు పాల్గొని సౌహార్ధ సందేశం ఇచ్చారు. పార్వతీపురం , పాలకొండ, సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్ వరదరాజులు, శంకర్రావు, వేణు సంజీవి, రవి శంకర్రావు, తోపుడుబండ్ల సంఘం జిల్లా నాయకులు సూరిబాబు పాల్గొని ప్రసంగించారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా సింహాచలం, ఎన్‌వై నాయుడు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు)జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ సింహాచలం, ఎన్‌వై నాయుడు, కోశాధికారిగా సంజీవి ఎన్నికయ్యారు. మహాసభ సందర్భంగా 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శంకర్రావు, వేణు, వరదరాజులు, నిర్మల, సహాయ కార్యదర్శిగా రవి, శంకర్రావు, చింతల సురేష్, రాముడు, ఇందు, కమిటీ సభ్యులుగా శ్రీదేవి, వెంకటరావు, హరిబాబు, తిరుపతి ఎన్నికయ్యారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

రెండోరోజు కొనసాగిన గాలింపు



గాలింపు చర్యలపై ఆరాతీస్తున్న సబ్‌కలెక్టర్ జగన్నాథ్

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి అనే మహిళ శనివారం వంశధార నదిలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. శనివారం కొత్తూరు ఫైర్ సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టినా లక్ష్మి ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం తహశీల్దార్ శివన్నారాయణ, ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో ఎస్‌డిఆర్‌ఎస్ సిబ్బంది వంశధార నదిలో మరోసారి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలను పర్యవేక్షించారు. లక్ష్మి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి, ఘటనపై ఆరాతీశారు. గాలింపు చర్యలు వేగవంతం చేయాలని ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి సూచించారు. నది ప్రవాహం ఎక్కువగా ఉందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ సిఐ రవిప్రకాశ్

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ సిఐ రవిప్రకాశ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. స్థానిక ఎస్ఐ సురేష్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉన్నా, అధిక ధరలకు అమ్మినా, ఎరువులు పక్కదారి పట్టించినా తీవ్రమైన చర్యలు ఉంటాయని సిఐ తెలిపారు. ఇకపై 24 గంటలూ ఎరువుల దుకాణాలపై నిఘా ఉంచుతామని చెప్పారు. చెక్‌పోస్ట్ దగ్గర కూడా పూర్తిగా నిఘా ఉంచామని తెలిపారు. ఎక్కడైనా అనధికార విక్రయాలు జరిగితే కేసులు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావుకు సూచించారు. మండలంలో ఎరువులపై నిరంతర నిఘా కోసం తహశీల్దార్, ఎస్ఐ, ఎఒతో కలిసి ప్రత్యేక బృందం పనిచేస్తుందన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, పోలీసులు

సైక్లింగ్‌తో మానసిక ఆరోగ్యం

'సండే ఆన్ సైకిల్ ర్యాలీ'లో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

సైక్లింగ్‌తోనే మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పార్వతీపురంలో సండే ఆన్ సైకిల్ ర్యాలీని ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధంగా చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగిస్తున్నప్పటికీ, శారీరక చురుకుదనం లేకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమని అభిప్రాయ పడ్డారు. అందులో భాగంగా తమ దైనందిన జీవనశైలిలో కొంత సమయం సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని కోరారు. సైక్లింగ్ సాధారణ ఆరోగ్య పరిరక్షణ కోసం ఒక సరళమైన, సురక్షితమైన మార్గమని చెప్పారు.

ఇది కేవలం శరీరానికి మేలు చేయడం మాత్రమే కాక, పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని తెలిపారు. పోలీస్ సిబ్బంది ప్రతిరోజూ విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం తప్పనిసరని చెప్పారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాంబాబు, నాయుడు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుతో సమావేశమైన ఎమ్మెల్యే జయకృష్ణ

రైతులు ఇబ్బంది పడుతున్నారు

అచ్చెన్నను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాలకొండ

నియోజకవర్గంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ.. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం విజయవాడలో మంత్రి స్వగృహంలో ఆయన్ను కలిసి, ఎరువుల సమస్యను వివరించారు. ఎరువుల కొరత ఉండటం వల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఖరీఫ్ పంటకు ఎరువులు లేకపోవడం వల్ల పంట కూడా నాశనమయ్యే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, జాడ శ్రీధర్, ఉదయాన ఉదయభాస్కర్, నవీన్ తదితరులు ఉన్నారు.

సరిపడా ఎరువులు అందించాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పాలకొండ

యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. ఈ సమస్యపై ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్రం సరఫరా చేయడం లేదన్నారు. ఉన్న యూరియా కూడా బ్లాక్ మార్కెట్‌కి తరలిపోతోందని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. ఈ నెల 28న జరిగే ధర్నాకు రైతులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, నాయకులు ఎ.సింహాద్రి, కండపు ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం నిరసన

సాలూరురూరల్ : రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక పంచాయతీ పరిధిలో వచ్చిన ఎరువులను సారిక, గంజాయి భద్ర పంచాయతీ పరిధిలోని గిరిజన రైతులకు ఒకటి, రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రోజుల తరబడి ఆర్‌ఎస్‌కెల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. యూరియా, డిఎపి వంటి ఎరువులు సరిపడా అందుబాటులో లేవని, ఉన్నా అరకొర ఎరువులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో తాడంగి చరణ్, సన్నం, బుచ్చయ్య, సీదరపు బాల పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు కృష్ణమూర్తి, బంటు దాసు, తదితరులు

ఎరువుల కొరత లేదు

- రైతులు ఆందోళన చెందొద్దు ● అక్రమ నిల్వలపై కఠిన చర్యలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్‌తో ముఖాముఖి



ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో యూరియా, డిఎపి ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ హెచ్చరించారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఎరువులు అక్రమ నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో పంటల సాగు, ఎరువుల పరిస్థితి గురించి ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

జిల్లాలో ఏయే పంటలు సాగు చేస్తున్నారు.?

జిల్లాలో ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేస్తున్నారు. వరి సాధారణ విస్తీర్ణం 1,78,422 ఎకరాలు కాగా, ఇంతవరకు 1,33,650 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 15,270 ఎకరాలు కాగా, 12,015 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పత్తి సాధారణ విస్తీర్ణం 19,585 ఎకరాలు కాగా, 12,717 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

జిల్లాలో చిరుధాన్యాల సాగు ఎలా ఉంది.?

జిల్లాలో చిరుధాన్యాల సాగు గతం కంటే క్రమేణా పెరుగుతోంది. వీటి వినియోగం కూడా పెరుగుతుండడంతో రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. రాగి సాధారణ విస్తీర్ణం 2100 ఎకరాలు కాగా, 2322 ఎకరాల్లో సాగవుతోంది. సామలు సాధారణ విస్తీర్ణం 292 ఎకరాలు కాగా, 322 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కొర్రలు సాధారణ విస్తీర్ణం 197 ఎకరాలు కాగా, 325 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

జిల్లాలో ఎరువుల పరిస్థితి ఏమిటి.?

జిల్లాలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 14,338 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. రైతులు వినియోగించింది 13,921 మెట్రిక్ టన్నులు. డిఎపి 7446 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయగా రైతులు 6748 మెట్రిక్ టన్నులు వినియోగించారు. జిల్లాలో ఇంకా 520 రైతు సేవా కేంద్రాల్లో 520 మెట్రిక్ టన్నుల యూరియా, 310 టన్నుల డిఎపి ఎరువులు నిల్వ ఉన్నాయి.

బ్లాక్ మార్కెట్లో ఎరువుల విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?



జిల్లాలో ఎరువులను బ్లాక్ మార్కెట్లో విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారుల దాడులు జరుగుతున్నాయి. మక్కువ మండలంలోని శంబర గ్రామంలో సరైన పత్రాలు లేకుండా ఎరువులు నిల్వ చేసిన డీలర్‌పై కేసు నమోదు చేశాం. అదే మండలంలో సన్యాసిరాజపురం గ్రామంలో అనధికారికంగా ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారిపై కూడా కేసు నమోదు చేశాం.

ఎరువుల వినియోగంపై రైతులకు సూచనలు ఏమిటి.?

ఎక్కువగా రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి సారం తగ్గుతుంది. ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యూరియా, డిఎపిలకు బదులుగా నానో యూరియా, నానో డిఎపిలను వాడాలని సూచించాం.

ఎరువుల కొరత ఎందుకు వస్తోంది.?

జిల్లాలో ఎరువుల కొరత లేదు. కానీ కొరత ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో రైతులు ఈరోజు అవసరాలకు సరిపడా తీసుకెళ్లకుండా రేపటి అవసరాలకు కూడా తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారు. దీని వల్లనే కొరత కనిపిస్తోంది.

ఫ్లోర్‌లీడర్‌ని బుజ్జగించిన భంజ్‌దేవ్

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తర్లాడ లక్ష్మీజీని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ బుజ్జగించారు.ఆదివారం సాయంత్రం తన నివాసానికి లక్ష్మీజీని పిలిపించిన భంజ్‌దేవ్.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని వారించారు. పార్టీలో వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీ ముఖ్యమని ఆయన లక్ష్మీజీకి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఫ్లోర్ లీడర్ తర్లాడ లక్ష్మీజీ టిడిపికి రాజీనామా యోచనలో ఉన్నట్టు తెలియడంతో భంజ్‌దేవ్ ఆయన్ని బుజ్జగించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు చోడవరపు గోవింద రావు ఉన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-కొమరాడ



నిలిచిపోయిన వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను డిమాండ్‌చేశారు. ఆదివారం పూర్ణపాడు-లాబేసు వంతెన పరిసర ప్రాంతాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసారీ నిధులు మంజూరు చేస్తున్నామని చెబుతున్నారు తప్ప పనులు మాత్రం క్షేత్రస్థాయిలో చేపట్టడం లేదన్నారు. నిధులు విడుదల చేసి వెంటనే వంతెన పెండింగ్ పనులు పూర్తి చేసి, 42 గ్రామాల ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు.

గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం

జాశక్తి - కురుపాం

గిరిజన విద్యార్థుల పట్ల అధికారుల నిర్లక్ష్యం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, బి.అనిల్ ఎ.గంగారావు అన్నారు. ఆదివారం మండలంలోని బొంపలపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 నుంచి 8వ తరగతి వరకు 30 మంది విద్యార్థులతో పాఠశాల నడుస్తున్నప్పటికీ ఆదివారం ఒక విద్యార్థి గాని, ఉపాధ్యాయులు గాని, వంటకుక్ గాని లేకపోవడం దారుణమన్నారు. కనీసం పాఠశాల ఉన్నట్టు కాపలా కాసేందుకు వాచ్‌మేన్ కూడా లేరన్నారు. ఎటిడబ్ల్యుఒ, డిడి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణమని చెప్పారు. విద్యార్థుల పై నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది, వార్డెన్‌పై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి : జిఎంపిఎస్

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని ఎపి గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షులు రండి అచ్చుతరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం సాలూరులో సంఘం నాయకులు బొట్ల నారాయణరావు, కేంద్ర సింహాచలంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంచార వాహనాల ద్వారా మందల వద్దకు వెళ్లి జీవాలకు వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పశువైద్య శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎన్‌సిడిసి ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పాముకాటు నష్టం సంభవిస్తే పెంపకందారులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చెరువు గట్లు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ సమస్యలపై సోమ, మంగళవారాల్లో ఒంగోలులో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలో చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు.

రక్తదానమే ప్రాణదానం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

రక్తదానం ప్రాణదానంతో సమానమని యూత్ కోఆర్డినేటర్ బికె అన్నపూర్ణ తెలిపారు. ఆదివారం సాలూరు పట్టణంలో బ్రహ్మకుమారీ ఈశ్వరియ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేణుగోపాలరావు, మీకై మేము సంస్థ అధ్యక్షులు దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించండి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్‌టిలకు, గురుకుల విద్యాలయాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీతాలు లేక ఉపాధ్యాయులు కుటుంబాలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మరోవైపు ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకులకు ఉన్న జీతాలు తగ్గాయని, తిరిగి పాత జీతాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కొమరాడ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కొమరాడలో ఆదివారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాతికేళ్ల గా అరకొర వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎంతో వ్యయ ప్రయాసలతో సొంత డబ్బులు పెట్టుకుని, అప్పులు తెచ్చి పెట్టుబడులు వంటచేసి పెడుతున్నారని చెప్పారు. సకాలంలో వంట బిల్లులు అందడం లేదని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి నెలా జీతాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సామల లక్ష్మి, కార్యదర్శిగా మరడాన సునీత ఎన్నికయ్యారు.



వెంకటరమణ భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

స్నేహితుడి కుటుంబానికి అండగా..

ప్రజాశక్తి -భామిని

భామిని మండలం బాలేరు గ్రామానికి చెందిన గువ్వాడ వెంకటరమణ ఇటీవల గుండెపోటుతో మరణించాడు. వెంకటరమణ చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాడు. వెంకటరమణతోపాటు 2000- 01 సంవత్సరంలో ఎల్‌ఎన్‌పేట గ్రామంలో పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులు విషయం తెలుసుకొన్నారు. వెంకటరమణ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. వెంకటరమణ భార్య పేరిట రూ.60 వేలు పోస్టల్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, డాక్యుమెంట్‌ను ఆదివారం ఆ ఆమెకు అందజేశారు. ఖర్చుల నిమిత్తం రూ.6 వేలు అందజేసి మంచిమనసు చాటుకున్నారు.

పంపిణీకి సిద్ధంగా మట్టి విగ్రహాలు

ప్రజాశక్తి-సీతానగరం

యలమ వారిని సంస్థ అధినేత, పెదబోగిలి ఉప సర్పంచ్ కంకణాపల్లె అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీకి సిద్ధం చేశారు. ఏటా వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని, ఈ ఏడాది ఐదు వేల విగ్రహాలు అందిస్తామని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ఏటా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

ఉపాధి శిక్షణ ఏది?

- తీవ్ర నిరాశలో గిరిజన యువత
- వలస బాట పడుతున్న వైనం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా, అధికారుల వచ్చి పోతున్నా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువతకు ఉపాధి మార్గాలు చూపడం లేదు. దీంతో గత కొన్నేళ్లుగా గిరిజన యువత తీవ్ర నిరాశలో కనిపిస్తున్నారు. ఇక్కడ చేసేది లేక బతుకు జీవనం కోసం వలస బాట పడుతున్నారు. ప్రతి ఏటా ఏదో ఒక గ్రామం నుంచి యువత ఉపాధికే వలస వెళ్లడం పరిపాటిగా మారింది. ఇంత జరుగుతున్నా పాలకులు ఉపాధి మార్గాలు మాత్రం చూపించడం లేదు.



ఉపాధి శిక్షణ లేక నిర్మానుష్యంగా ఉన్న వైటిసి

గత టిడిపి హయాంలో పార్వతీపురం మన్యం జిల్లాలో ఐటిడిఎల పరిధిలో ఉన్న గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, సీతంపేటలో గిరిజన నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వాలనే ఉద్దేశంతో యూత్ ట్రైనింగ్ సెంటర్లు (వైటిసి) ఏర్పాటు చేశారు. వైటిసిల నిర్వహణ, అందులో పని చేస్తున్న ఉద్యోగుల జీతాల కోసం ట్రైకార్ నిధులను వినియోగించేవారు. 2017 నుంచి 2019 వరకు ఎంతోమంది నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు కంప్యూటర్, టైలరింగ్, డ్రెస్ మేకింగ్, డ్రైవింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేవారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు రోజుకు రూ.160 చొప్పున సమకూర్చేవారు. రెండు నెలల కాలం శిక్షణ ఉండేది. శిక్షణ నిర్వాహకులకు రూ.10 వేలు చొప్పున చెల్లించేవారు. శిక్షణ కోసం కంప్యూటర్లు, కుట్టు మిషన్లు సమకూర్చారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు యువత హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి స్థిరపడ్డారు. ఇలాంటి వైటిసిలు సైతం గత కొన్నేళ్లుగా మూతపడ్డాయి. దీంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కరువైంది, ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైటిసి కేంద్రాలు ఉపాధి శిక్షణ లేక వెలవెలబోతున్నాయి.

కరోనా మహమ్మారి పేరుతో..

గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాటు వైటిసిల నిర్వహణ సక్రమంగా సాగింది. కరోనా మహమ్మారి రావడంతో శిక్షణ నిలిపివేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టినా శిక్షణ తిరిగి ప్రారంభించలేదు. దీంతో ఉపాధి శిక్షణ లేక నిరుద్యోగ గిరిజన యువత నిరాశలో ఉన్నారు. పార్వతీపురం వైటిసిలో ఎస్‌పి కార్యాలయం ఏర్పాటు చేశారు. గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. చివరికి గిరిజన యువతకు ఉపాధి శిక్షణ లేకపోవడంతో వలసలు వెళ్లిపోతున్న పరిస్థితి. నెలకొంది.

ఉపాధి శిక్షణ ఇవ్వాలి



ఏజెన్సీలో చదువుకున్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు సాంకేతిక రంగంలో శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి కల్పించాలి. అప్పుడే వలసల నివారణకు అవకాశం ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా నిరుద్యోగ యువత వైపు మాత్రం కన్నెత్తి చూపడం లేదు. దీంతో వలస బాట తప్పడం లేదు.

- మండంగి రమణ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి



పాఠశాలలో చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫొటో)



రహదారికి ప్రధాన కాలువ లేకపోవడంతో ఒకే చోట నిలిచి ఉన్న మురుగునీరు

కాలువ కబ్జా

- ఎక్కడ నీరు అక్కడే..
- చినుకు పడితే బిసికాలనీ వాసులకు గుబులు
- జాయింట్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామంలో పార్వతీపురం-వీరఘట్టం రహదారికి ఆనుకుని ఉన్న ప్రధాన కాలువ కబ్జాకు గురైంది. ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోతోంది. దీంతో గ్రామంలోని బిసి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాడుక నీరంతా ఎటూ వెళ్లేందుకు వీల్లేక ఒకే చోట ఉండిపోతోంది. దుర్గంధం వెదజల్లడంతో రోగాల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇటీవల మండలంలో విస్తారంగా కురిసిన వర్షాల వల్ల ప్రధాన కాలువ లేకపోవడంతో పైనుంచి వచ్చే వరద నీరు పాఠశాలలోకి, బిసి కాలనీలోకి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పాఠశాల నుంచి నడుకూరు గ్రామానికి సమీపంలోని ఆర్‌సిఎం చర్చి వరకు కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అప్పటి జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు కూడా చేశారు. జాయింట్ కలెక్టర్ నడుకూరు గ్రామానికి చేరుకొని పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి ప్రధాన కాలువ నిర్మించాలని స్థానిక పాలకవర్గాన్ని ఆదేశించారు. ఆయన ఆదేశాలను పాలకవర్గం పక్కన పెట్టడంతో ఎప్పుడు వర్షం పడినా స్థానికులు నరకయాతన పడుతున్నారు.

కాలువకు ఆనుకొని పాఠశాల ఉన్నందున విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీరఘట్టం-పార్వతీపురం ప్రధాన రహదారిపైనే అక్కడక్కడ నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టి సారించి, కబ్జాలను తొలగించడంతోపాటు ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అవి అసత్య ఆరోపణలే : జనసేన

ప్రజాశక్తి-కొమరాడ

తనపై ఆధారాలు లేని అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు తెంటు శ్రీకర్ తెలిపారు. ఆదివారం కొమరాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి నాయకులు జనసేన పార్టీపై, తనపై తప్పుడు ఆరోపణలు చేయడంపై ధ్వజమెత్తారు. టిడిపి అరకు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నంగి రెడ్డి మధుసూదన్‌రావు, స్థానిక వైసిపి నాయకులతో కలిసి జనసేన ఎదుగుదలను అడ్డుకునేందుకు ఒక తప్పుడు ఆడియోను సృష్టించి, సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో వచ్చిన ఆడియోను విని ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. తాను ఎవరి వద్ద నుంచి అయినా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు చూపాలని సవాల్ చేశారు. వైసిపి నాయకులకు ఆడియోలు ఇచ్చిన టిడిపి నేత మధుసూదన్ రావు అనేక భూదందాలు చేశారని ఆరోపించారు. వారు చేసిన అన్ని అక్రమాలపై ఆధారాలు ఉన్నాయని, భవిష్యత్తులో బయటపెడతామని చెప్పారు. అందుకే కొంతమంది టిడిపి నాయకులు వైసిపితో కుమ్మక్కై ఆరోపణలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్రావు, చినకేర్జల పంచాయతీ సర్పంచ్ గంగాధర్, జనసేన నాయకులు పి.గోపాలకృష్ణ, ఎం.రామకృష్ణ, చంటి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, కార్యదర్శి ఆర్.రామ డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వసూలు చేస్తున్న సెస్ నిధులను వారి కోసం వెచ్చించడం లేదన్నారు. ఇప్పటివరకు లక్షా 17 వేల కోట్ల రూపాయలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేశాయని చెప్పారు. ఇందులో సుమారు 70 వేల కోట్ల రూపాయలు ఇతర అవసరాలకు ప్రభుత్వాలు వినియోగించుకొని, భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ కార్మికులు అనేకమంది ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని, కొంతమంది వికలాంగులుగా మారుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా పింఛన్లు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నింటిపై సెప్టెంబర్ ఒకటి నుండి ఏడు వరకు మండలాలలో ప్రచారం నిర్వహించి, ఎనిమిదో తేదీన జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కార్యదర్శి బి వి రమణ, నాయకులు తాడి శ్రీను, గుడివాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లపై రికవరీలు, సస్పెన్షన్లు విధించడం వంటి వేధింపులు నిలిపివేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి హరనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో జరిగిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల సోషల్ ఆడిట్ పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. వేతన దారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా చిన్న, చిన్న సాంకేతిక కారణాలు చూపించి రికవరీలు, సస్పెన్షన్లు విధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత 20 సంవత్సరాలుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు తీవ్ర అన్యాం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అనేకమంది ఉన్నత చదువులు చదివారని, అలాంటి వారికి కేవలం రూ.5740 వేతనం ఇచ్చి జీవితానికి ఎలాంటి భరోసా లేకుండా చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సిఐటియు ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సెప్టెంబర్ 7న పార్వతీపురంలో జరిగే ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి పోల సింహాచలం నాయుడు, నగిరెడ్డి ఆదినారాయణ, పోతుల రామారావు, చల్ల సింహాచలం, ఉల్లా నాగరాజు, లాడి దుర్గారావు, లక్ష్మి తులసి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-సీతానగరం



సిఐటియు జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాలకొండలో సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి గౌర వెంకటరమణ కోరారు. ఆదివారం సిఐటియు జిల్లా మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కును హరిస్తూ 12 గంటల పని విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న 44 రకాల చట్టాలను కుదించి నేడు నాలుగు లేబర్ కోడ్లుగా మార్పు చేశారని, రాత్రిపూట మహిళలతో పనిచేయడం అన్యాయమని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, కార్మికులు పోరాడి తాము సాధించుకున్న హక్కుల సాధనకు జిల్లా మహాసభలో చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, రాయపల్లి రాము, వై,శాంతి కుమారి, టి.రమేష్, జె.గౌరీ, పి.గౌరమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

తాళ్లడుమ్మలో అగ్ని ప్రమాదం

రూ. 8 లక్షలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జియ్యమ్మ వలస మండలంలోని తాళ్లడుమ్మ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. రైతు శ్రీరామ్మూర్తి ఇంటి వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. రెండు పెంకుటిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. శ్రీరామ్మూర్తి ఇంటి బీరువాలో ఉన్న నగదు, పొలం పత్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.8 లక్షలు మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

పలువురికి పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీ పురం



పెదబుడ్డిడిలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస మండలంలో ఆదివారం పలువురిని మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు పరామర్శించారు. రామినాయుడువలసలో ఇటీవల మరణించిన మాజీ జెడ్‌పిటిసి రెడ్డి శకుంతలమ్మ, గవరంపేటలో బాబూరావు కుటుంబాలను, పెదబుడ్డిడిలో పలువురిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

కురుపాం : కురుపాంలో సీనియర్ పాత్రికేయులు నెల్లి శ్రీనివాసరావు తండ్రి సింహాచలం చేతికి ఇటీవల గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి .. ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, సర్పంచ్ జి.సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, నాయకులు ఆకుల శ్రీధర, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒను కలిసిన జనసేన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ఆదివారం జనసేన మండల అధ్యక్షులు మండంగి విశ్వనాథం, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు సవర ప్రసాదరావు, కుండంగి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

సీతంపేట: మండలంలో దోనుబాయి గ్రామంలో ఎస్ఐ షేక్ మస్తాన్ రోడ్డు ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్లరాదని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గంజాయి, గుట్కా వంటి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ త్రినాథరావు పాల్గొన్నారు



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ సిబ్బంది

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలైన వలవ, కెరడా, వనిజ, బోరవలసలో ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం దాడులు చేపట్టారు. సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 7,600 లీటర్ల బెల్లంఊటతోపాటు 150 లీటర్ల సారాను ధ్వసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. సారా తయారీ, అమ్మకాలపై నిరంతరం నిఘా పెడుతున్నామని తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలు చేసే వారిపై 6302936599 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.